

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:21 గురువారం
సహర్ 5:09 శుక్రవారం

హోలీ.. ఆనందాల కేళి
- రేపు హోలీ పండుగ
- రెండు రోజుల పాటు వేడుకలు
- సహజ రంగులే మేలని నిపుణుల సూచన

6

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

బెల్లంపల్లిరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తాళ్లగురిజాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రౌడీషీటర్లకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందరు సత్ప్రవర్తనతో ఉండాలని, సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి భూమి సెటిల్‌మెంట్‌లు, పంచాయతీలు చేయవద్దని హెచ్చరించారు. రౌడీషీటర్ల ఎప్పుడు నిఘా ఉంటుందని, అందుకే సత్ప్రవర్తనతో ఉంటూ కుటుంబాలను పోషించుకోవాలని సూచించారు. నేరాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడి అరెస్టు

భీమిని, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మైనర్ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన భీమిని మండలం జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేగుచెట్టు రమేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. అదే పాఠశాలలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 28న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు అయింది. జిల్లా విద్యాశాఖ అధికారులు రమేష్‌పై మార్చి 7న సస్పెన్షన్ వేటు వేశారు.

75 శాతం సబ్సిడీపై స్ప్రింక్లర్ పైపులు

భీమిని, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో 75శాతం సబ్సిడీపై స్ప్రింక్లర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని బెల్లంపల్లి ఉద్యానవనశాఖ అధికారి అరుణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దీనిలో 25 పైపులు, 5 స్ప్రింక్లర్‌కు కలిపి 75శాతం సబ్సిడీ పోను రూపాయలు 7,480 డీడీ తీయాలని కోరారు. దీని కొరకు రైతులు అప్లికేషన్ ఫామ్‌తో పాటూ ఆధార్‌కార్డు, పట్టాపాసు బుక్ జిరాక్స్, మీసేవలో 1 బీ, బ్యాంక్‌బుక్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో, దరఖాస్తు ఫామ్‌పై పంచాయతీ కార్యదర్శి, ఆర్ఐ సంతకం చేసి మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సన్నాలకు బోనస్ ఎప్పుడు..?



- రెండు నెలలైనా జమ చేయని ప్రభుత్వం
- యాసంగి సాగు ప్రారంభమైనా చేతికందని నగదు
- కొనుగోలు చేసింది 44వేల మెట్రిక్ టన్నులు
- చెల్లింపులు జరిగింది 20శాతం మాత్రమే

మంచిర్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీ నిలబెట్టుకోవడంలో విఫలమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత వానాకాలం సీజన్ నుంచి రాష్ట్రంలోని సన్నరకం ధాన్యం పండించిన రైతులందరికీ క్వింటాకు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లించాల్సి ఉంది. దీంతో సీజన్ ముందే వరి సాగు చేస్తే బోనస్ చెల్లిస్తామని ప్రచారం నిర్వహించడంతో జిల్లాలోని రైతులు సన్నాల సాగుకు మొగ్గు చూపారు. అయితే సీజన్ ముగిసి దాదాపు మూడు నెలలైన బోనస్ డబ్బులు పూర్తిస్థాయిలో జమ కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో సన్నరకాన్ని ప్రోత్సహించింది. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించాల్సి ఉంది. అయితే యాసంగి సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు బోనస్ చెల్లింపు జరగకపోవడంతో పెట్టుబడి సమయంలో నగదు చేతికందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రూ.70వేల బోనస్ రావాల్సి ఉంది



వానాకాలం సాగులో ఎనిమిది ఎకరాల్లో సన్న వడ్లు వేశాను. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో లబ్ధి జరుగుతుందనే ఉద్దేశంతో సన్నాలవైపు మొగ్గు చూపాను. కొనుగోలు కేంద్రంలో డిసెంబరులో 150 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం విక్ర యించాను. రూ.70వేల బోనస్ రావాల్సి ఉంది. మూడు నెలలుగా ఎదురుచూస్తున్నా ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాలో జమ కాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా బోనస్ చెల్లించాలి.

- రాళ్లబండి శ్యాంసుందర్,రైతు, కోటపల్లి

● 44వేల మెట్రిక్ టన్నుల సేకరణ...

జిల్లావ్యాప్తంగా వానకాలం సీజన్‌లో 7,517 మంది రైతులు సన్న రకం ధాన్యం సాగు చేయగా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 44,344 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి బోనస్ చెల్లింపులు పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయి.

● 6,242 మంది రైతులకు అందని బోనస్

వానాకాలం సాగు పంట కొనుగోలు కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 319 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. డిసెంబరు-జనవరి మాసాల్లో వానాకాలం సాగు పూర్తికాగా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నగదు రైతుల ఖాతాల్లో జమకాలేదు. జిల్లా వ్యాప్తంగా డీసీఎంఎస్, డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా...

మిగతా 7లో..

వివిధ మండలాల్లో సాగైన సన్నరకం ధాన్యం

మండలం	సన్నరకం(ఎకరాలు)
బెల్లంపల్లి	4,868
కాసిపేట	1,603
తాండూర్	3,756
భీమిని	3,070
కన్నెపల్లి	6,811
నెన్నెల	7,282
వేమనపల్లి	5,166
చెన్నూర్	16,600
జైపూర్	12,640
భీమారం	4,425
కోటపల్లి	8,350
మందమర్రి	6,200
దండేపల్లి	20,570
జన్నారం	16,354
లక్షెట్టిపేట	13,877
హాజీపూర్	6,122
మంచిర్యాల	475
నస్పూర్	820
మొత్తం	1,38,989

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి



పంచాయతీ రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

తాండూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని కిష్టంపేట, తాండూర్, రాజీవ్‌నగర్ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య పనులను, నర్సరీలను, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు ఇంటింటికి తడి, పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలన్నారు. గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య పనులను చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని, పంచాయతీ రికార్డులను అప్‌డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉదయ్‌కుమార్, దివాకర్, రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మీడియాకు స్వేచ్ఛ కరువు

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

మంచిర్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో మీడియాకు స్వేచ్ఛ లేకుండా పోయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ బుధవారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. సీనియర్ మహిళ జర్నలిస్టు రేవతిని హైదరాబాద్‌లో అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు. ఒక రైతు కాంగ్రెస్ సర్కారులో తాను ఎదుర్కొంటున్న కష్టాలను చెబితే ఆ వీడియోను జర్నలిస్టు రేవతి పోస్టు చేసినందుకు అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మీడియా, సోషల్ మీడియా గొంతు నొక్కుతున్నారన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

లోవోల్టేజీ సమస్య తీర్చేందుకు కెపాసిటర్ల ఏర్పాటు



చాకెపల్లిలో ఏర్పాటు చేసిన కెపాసిటర్ వద్ద ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ బాలకృష్ణ

చెన్నూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా లైన్ కెపాసిటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. బుధవారం నాగాపూర్ ఫీడర్ పరిధిలోని చాకెపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద లైన్ కెపాసిటర్లను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ లోవోల్టేజీ సమస్య రాకుండా ఉండేందుకు రక్షణ చర్యల్లో భాగంగా కెపాసిటర్లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అలాగే వేసవిలో ప్రతీ రోజు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తలకు మూడు సార్లు నీళ్లు పట్టించాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు కాలిపోకుండా రైతులకు తగు జాగ్రత్తలు సూచించాలని ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, రాజమల్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

సమన్వయంతో శాంతిభద్రతల పరిరక్షణ

● సీపీ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల పోలీసు స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సీపీ

మంచిర్యాల క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బుధవారం మంచిర్యాల పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ పోలీసుస్టేషన్‌లోని కేసుల వివరా లను పోలీసుస్టేషన్ నిర్వహణ, విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలు, రౌడీ షీటర్ల బైండోవర్లు, కౌన్సెలింగ్, మొదలైన విషయాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మంచిర్యాల జోన్ రామగుండం పోలీసు కమిషనరేట్‌లో అధికంగా విస్తరించి ఉందన్నారు. మంచిర్యాల పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. భద్రత, పరిరక్షణ ట్రాఫిక్ విషయంపై అధికారులతో మాట్లాడారు. ప్రజలకు ఉత్తమమైన పారదర్శకతో, చట్టభద్రతతో ఉత్తమ సేవలు అందించడంపై చర్చించారు. పోలీసుకమిషనరేట్ పోలీసుశాఖ బాధ్యతాయుతంగా ఉంటామని అందులో భాగంగా పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. పారిశ్రామిక ప్రాంతం ఎక్కువగా ఉండడంతో రాత్రి సమయంలో డ్యూటీకి వెళ్లేవారు, ఇతర వ్యాపారాల నిమిత్తం నిత్యం తిరుగుతుంటారని వారి భద్రతకోసం ప్రతీరోజు పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సేవచేయడానికి సిద్ధంగా ఉన్నామని సీపీ తెలిపారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు, మహిళ పోలీసు స్టేషన్ సీఐ నరేశ్ కుమార్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

● బ్లూకోల్ట్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నేరాల నియంత్రణలో ప్రజలకు అందుబాటులో ఉండే బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రామ గుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. రామగుండం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధ వారం పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు కమిషనరేట్ పరిధిలో చాలా వరకు పారిశ్రామిక ప్రాంతం ఉందని ఈ ప్రాంతంలో జరిగే విషయాలపై ప్రతీఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డయల్ 100కు కాల్ వచ్చినప్పుడు వేగంగా స్పందించాలని, తక్కువ సమయంలో సంఘటన స్థలానికి చేరుకొని సేవలు అందించాలని సూచించారు. ప్రజలతో బాధ్యతాయుతంగా మెలగాలని, బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, బ్లూకోల్ట్స్, పెట్రోకార్, వర్టికల్ ఇన్‌చార్జిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట

లక్షెట్టిపేటరూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్‌లో విద్యుత్ అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసు కురావాలన్నారు. గ్రామంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఎర్తింగులను లూప్‌లైన్లను సరి చేశారు. ఏఈ గణేష్, ఫోర్‌మెన్ నర్సింగరావు, లైన్‌మెన్స్ శ్రీనివాస్, సదయ్య ఉన్నారు.

ప్రమాదానికి గురైన మహిళను ఆసుపత్రికి తరలించిన డీసీపీ



మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం వేంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మహిళను మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆసుపత్రికి తరలించారు. మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపునకు వెళ్లుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై పడిఉన్న మహిళను గమనించిన డీసీపీ భాస్కర్ స్వయంగా ఆటోలో తరలించారు. ఆయన స్పందించిన తీరుపై వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సన్నాలకు బోనస్‌ను వెంటనే చెల్లించాలి

● దండేపల్లిలో బీజేపీ నాయకుల రాస్తారోకో

దండేపల్లి, మార్చి 12: అర్హులైన రైతులకు వెంటనే రుణ మాఫీ చేయాలని, సన్నరకం ధాన్యానికి రైతులకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని కోరుతూ దండేపల్లిలో ఎల్లయ్యపల్లెలో రైతులతో కలిసి బీజేపీ నాయకులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఉదయం నుంచే ముందస్తుగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు వారి ఇళ్లలోకి అరెస్ట్‌చేసి దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కొందరు నాయకులు ఆందోళన చేయడానికి నాయకులు వస్తే, ఈ విషయం తెలుసుకున్న దండేపల్లి, జన్నారం ఎస్సైలు తైసినోద్దీన్, రాజవర్ధన్ తమ పోలీసు సిబ్బంది పార్టీ కార్యాలయం వద్ద మోహరించారు. వారిని బయటికి రావాలని పోలీసులు పదే పదే చెప్పినప్పటికి వారు వినకుండా పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులు పత్తిపాక సంతోష్, గుండ రవీందర్, వనపర్తి రాకేష్, గడికొప్పుల సురేందర్ నిరసన దీక్ష చేశారు. కాగా మరికొందరు నాయకులు రైతులతో కలిసి పోలీసుల కళ్లుకప్పి రోడ్డుపై వచ్చి రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు అక్కడి చేరుకొని వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన నాయకులను సొంత పూచికత్తుపై సాయం త్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు గాదెశ్రీనివాస్ మాట్లాడు తూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా రైతులను మోసం చేస్తోందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయకు బీజేపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.



దండేపల్లి ఎల్లయ్యపల్లె వంతెన వద్ద రాస్తారోకో చేస్తున్న బిజేపి పార్టీ నాయకులు, రైతులు

● పోలీసుల మోహారింపు..

రైతు సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నాయకులు తలపెట్టిన ఆందోళన, రాస్తారోకో జరగకుండా మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ ఆధ్వర్యంలో దండేపల్లి, జన్నారం ఎస్సైలు తైసోనోద్దీన్, రాజవర్ధన్ పోలీసు సిబ్బందితో తాళ్లపేట, మ్యాదరిపేట, దండేపల్లి, ముత్యంపేట ప్రధాన సెంటర్ల పోలీసు సిబ్బంది మోహరించి వారు బందోబస్తుతో పర్యవేక్షించారు.

గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్నాం

ఇందిర, సీడీపీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సీడీపీవో: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. సమయపాలన పాటించకున్నా, పోషకాహారం అందించకున్నా సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: జైనూరు ఐసీడీఎస్ పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి?

సీడీపీవో: జైనూరు ఐసీడీఎస్ పరిధిలో జైనూరు, లింగాపూర్, సిర్పూర్(యు), మండలాలు ఉన్నాయి. ప్రాజెక్ట్ పరిధిలో 175 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణకు ఎంత మంది సూపర్‌వైజర్లు ఉన్నారు

సీడీపీవో: జైనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నలుగురు సూపర్‌వైజర్లు ఉన్నారు. అందులో ఇద్దరు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. మరో మిగిలిన ఇద్దరితో సెంటర్ల పర్యవేక్షణ కష్టమవుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.

- జైనూర్, ఆంధ్రజ్యోతి

గాయంతో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

- అనుమానంతో పోస్టుమార్టం చేయించిన పోలీసులు

కౌటాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాయిపేట గ్రామంలో దుర్గం కారు(60) అనే వృద్ధుడు గాయంతో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. వృద్ధుడి మృతిపై అనుమానంతో సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. దుర్గం కారు కుటుంబ సభ్యుల మధ్య సోమవారం రాత్రి ఇంట్లో వాగ్వాదం జరిగింది. కుటుంబ సభ్యులు వృద్ధుడిని నెట్టివేయగా కింద పడడంతో తలకు గాయమైంది. దీంతో అదే రాత్రి కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి మంగళవారం సాయంత్ర దహన సంస్కారాలు చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. వృద్ధుడిని కుటుంబ సభ్యులు కొట్టి చంపారని స్థానికంగా చర్చ జరిగింది. విషయం పోలీసులకు తెలియడంతో సీఐ ముత్యం రమేశ్ పోలీసులతో అక్కడికి చేరుకని కుటుంబీకులను విచారించారు. వారి సమాధానం అనుమానాస్పదంగా ఉండడంతో రెవెన్యూ అధికారుల సహకారంతో పోలీసులు మంగళవారం సాయంత్రం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిర్పూర్(టి)లోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం ఉదయం వృద్ధుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయంపై కౌటాల ఎస్సై మధుకర్‌ను వివరణ కోరగా దుర్గం కారు ఇంట్లో వెనకకు పడిపోవడంతో తలకు గాయమై మృతి చెందినట్లు కుటుంబీకులు ఫిర్యాదు చేశారని చెప్పారు. కానీ పోలీసులకు అందిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా గుర్తించి పోస్టుమార్టంకు పంపామని అన్నారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తేనే మృతికి కారణాలు తెలుస్తాయని తెలిపారు.

ఉపాధి హామీ పనులు అడ్డగింత

కాగజ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం దరిగాం ఫారెస్టు చెక్ పోస్టు కెనాల్ వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎఫ్‌బీవో రవి అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తుండగా ఎఫ్‌బీవో రవి ఇక్కడ ఎందుకు పనులు చేస్తున్నారని కూలీలను దుర్భాషలాడారు. దౌర్జన్యం చేసి ద్విచక్ర వాహనాలకు సంబంధించి తాళాలను తీసుకెళ్లారు. సమాచారం మేరకు ఎంపీడీవో రమేశ్ సంఘటానికి చేరుకొని కూలీలపై దౌర్జన్యానికి పాల్పడిన ఎఫ్‌బీవో రవిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా, కూలీలను తిట్టినట్టు, దౌర్జనం చేసినట్టు ఎఫ్‌బీవో రవిపై ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హోలీ ఆనందాల కేళి

రేపు హోలీ పండుగ

రెండు రోజుల పాటు వేడుకలు

సహజ రంగులే మేలని నిపుణుల సూచన



నస్పూర్/దండేపల్లి/బెజ్జూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ చిన్న పిల్లలుగా మారిపోయే వేడుకంటే హోలీనే గుర్తొస్తుంది. కదూ. ఎంత సేపు ఆడినా తనివి తీరదు. సమయమూ తెలియదు. ఒళ్లంతా రంగులతో నిండిపోతే మనసుకి తెలియని ఉత్సాహం. మరి ఆ తరువాత రంగులను వదలగొట్టడానికి నానా తిప్పలు పడాలి. అంతేనా? రంగుల్లోని రసాయనాల కారణంగా చర్మం. కురులు దెబ్బతింటాయి. కళ్లు, శ్వాస సంబంధిత సమస్యలూ ఎదురవుతాయి. కాబట్టి సహజ రంగులనే వాడండి. ఇంట్లో తయారీ ఇబ్బంది అనుకుంటే ఆన్‌లైన్ సాయం తీసుకోండి. బోలెడు సంస్థలు వీటిని అందిస్తున్నాయి. పసుపు, గులాబీ రేకులు, వేప, బీట్ రూట్, నేరేడు.. వీటన్నింటిని ఉపయోగించి రంగులను సిద్ధం చేస్తున్నాయి. కావాల్సిన రంగులన్నీ దొరుకుతున్నాయి. పైగా సహజ సిద్ధంగా నచ్చిన ట్లుగా రంగుల కేళీ ఆడేసుకోవచ్చు. ఇది కదా ఆనందం. మరి ప్రతి ఒక్కరూ ప్రయత్నించండి.. ఆనందంగా ఆడుకోండి ఆరోగ్యంగా హోలీ..



కామదహనం..

హోలీ పండుగ ముందు రోజు రాత్రి అన్ని గ్రామాల్లోని రహదారులపై కూడళ్లలో పిడుకలు, కట్టెలు పేర్చి కాముడిని దహనం చేస్తారు. ఈ పండుగను రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. మొదటి రోజు కామదహనం నిర్వహిస్తారు. ఆ మరుసటి రోజు హోలీ పండుగ జరుపుకుంటారు. గ్రామాల్లో ఈ సందర్భంగా ప్రతీ ఇంటి నుంచి మక్కలు, శనగలు ఇతర ధాన్యాలు సేకరించి కొత్త కుండలో వేసి ఉడకబెడతారు. కామ దహనం చుట్టూ వేస్తూ నీటిని పోస్తారు. మరుసటి రోజు కాముని బూడిదను ఇంటికి తీసుకెళతారు. ఇదో ఆనవాయితీ.

విషాదాలకు తావివ్వొద్దు..

హోలీ విషాదాలకు తావివ్వొద్దని నిపుణులు సూచిస్తున్నారు.. రసాయనాలు వినియోగించి తయారుచేసినవి కాకుండా సహజ సిద్ధమైన రంగులను వాడాలని వైద్యులు చెబుతున్నారు. వీటిల్లో కొన్ని రసాయన పదార్థాల వల్ల క్యాన్సర్, అంధత్వం, కళ్ళు ఎర్రగా మారడం, ఆస్తమా, చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కృత్రిమ రంగులు భూతల్లితో పాటు నీటి వనరులను హాని కలిగిస్తాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఆకుపచ్చ రంగులో కాపర్ సల్ఫేట్, గులాబీ రంగులో లెడ్ కలుస్తుంది. దీని కారణంగా కళ్లు ఎర్రబడి మంట, రక్తంలో కలువడంతో క్యాన్సర్ ప్రమాదం ఉంటుంది.

సిల్వర్ కలర్‌లో అల్యూమినియం బ్రోమైడ్ రసాయనం కలుస్తుంది. ఎరుపు రంగులో మెర్క్యూరిక్ సల్ఫేట్ చర్మ క్యాన్సర్‌కు, గులాబీ రంగులో రోడమిన్‌బి చర్మ వ్యాధులకు కలిగిస్తోంది. క్రోమియం అయోడైడ్ కలిగిన పర్పుల్ కలర్‌ను వాడడం వలన ఊపిరితిత్తులకు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ప్రకృతిలో లభించే సహజ వనరులనే వాడాలని సూచిస్తున్నారు. హోలీ ఆడే ముందు శరీరానికి కొబ్బరినూనె రాసుకుంటే రంగుల దుష్ప్రభావం ఎక్కువగా ఉండదని, సన్ స్క్రీన్‌లోషన్ రాసుకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు. హోలీ వేడుకలు నిర్వహించుకున్న అనంతరం చెరువులు, కుంటలు జలాశయాల్లో స్నానం చేసేందుకు యువత వెళితే జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

జాజిరి.. జాజిరి..

కామదాహనాన్ని పురస్కరించుకుని జాజిరి.. జాజిరి అంటూ హోలీ పాటలు పాడుతూ చిన్నారులు వారం రోజుల పాటు కోలలు ఆడుతూ వీధుల్లో తిరుగుతూ చందాలు తీసుకుంటారు. కామదహనం రోజు ఆ కోలలను ఒక్కచోట చేర్చి దహనం చేస్తారు. మరుసటి రోజు హోలీలెరంగ హోలీ అంటూ మహిళలు చప్పట్లు కొడుతూ ఇళ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు వెళ్లి చందాలు తీసుకుంటారు.



భోజనంలో మెనూ పాటించాలి

తిర్యాణి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ సూర్య ప్రకాష్ అన్నారు. మండలంలోని గంభీరావపేట, ఏదులపాడు ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్‌లతో పాటు స్టోర్ గదిని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యను అందించాలని చెప్పారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తగిన సూచనలు అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

సైన్స్ పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి

పెంచికలపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మొబైల్ సైన్స్ ల్యాబ్ పర్యటన ద్వారా విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి పెరుగుతోందని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అన్నారు. మండలంలోని చెడ్వాయి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను సందర్శించారు.. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ శాస్త్రీయ ప్రయోగాలను చేయడానికి అవకాశం కల్పించారు. విద్యార్థులు వివిధ శాస్త్రీయ ప్రయోగ అంశాలను నేర్చుకొని వాటిని స్వయంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కొత్త ఆవిష్కరణలు చేసే సామర్థ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులు పుస్తకాలలో చదివిన శాస్త్రీయ అంశాలను ప్రత్యక్షంగా చూసి పూర్తిగా అవగాహన పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రాకేష్, సుమిత, రాజకమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల కోసమే వైద్య శిబిరం

జైనూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లోని పేదలకు వైద్యం అందించేందుకే శిబిరం ఏర్పాటు చేశామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ సమీపంలోని క్రికెట్ మైదానంలో బుధవారం ప్రతిమ ఆస్పత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ గిరిజనులకు వైద్యం అందనంత దూరంలో ఉందన్నారు. దీంతో వారు పడుతున్న ఇబ్బందులు గుర్తించి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. వైద్య శిబిరానికి ఆయా మండలాల నుంచి మూడు వందలకు పైగా ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకున్నారని అన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశామని తెలిపారు. రోడ్డు సదుపాయం లేని గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించామని చెప్పారు. దీని వల్ల అత్యవసర పరిస్థితిలో రాక పోకలకు ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు జర్గుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మోసపోపతే 1930 కాల్ చేయాలని సూచించారు. వైద్యశిబిరానికి హాజరైన వారికి జైనూరు సీఐ రమేశ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, సీనియర్ నాయకులు ఆత్రం భీంరావ్, మేస్రాం అంబాజీరావ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు



మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

పోలీసుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): పోలీసుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్‌లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బుధవారం హైదరాబాద్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను ఆయన ప్రారంభించారు. ఈ సదర్భంగా పోలీసు ఉన్నతాధికారుల నుంచి హోంగార్డ్స్ వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్, పల్స్ రేట్, 2డి ఎకో చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేపే పోలీసులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే విదులు సమర్థవంతంగా నిర్వహించగలరన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపులు, యోగా, క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే గొప్ప సంపదని ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంలో ప్రతి పోలీసు జీవితంలో ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుం దన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం కోసం కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్, సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ పెద్దన్న, సీఐ రవీందర్, శ్రీధర్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, జీఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

శ్రీరాంపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులకు అతి తక్కువ పెన్షన్ వస్తోందని, దానిని పెంచాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం జరిగిన పార్లమెంట్ సెషన్‌లో ఆయన మాట్లాడారు. 35 ఏళ్ల క్రితం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు వెంకటస్వామి సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పింఛన్‌ను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం 1500 మాత్రమే వస్తున్నాయని, ఆ డబ్బులతో 25 కిలోల బియ్యం బస్తా కూడా రాదని, వృద్ధాప్యంలో రిటైర్డ్ కార్మికులు ఎలా జీవిస్తారని అన్నారు. బొగ్గు ఉత్పత్తితో దేశానికి వెలుగులు ఇస్తూ, వారు చీకట్లో మగ్గుతున్నారని అన్నారు. సమాజంలో సింగరేణి రిటైర్డ్ కార్మికులు గౌరవంగా జీవించాలంటే కనీస పింఛన్‌ను 10 వేల రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఆర్‌కే 8 గనిని సందర్శించిన అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

శ్రీరాంపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గతంలో మూసివేసిన ఆర్‌కే-8 గనిని కోల్ కంట్రోల్ అధికారులు బుధవారం సందర్శించారు. పర్యావరణ బోర్డు నాగ్‌పూర్ రీజియన్‌కు చెందిన ఓఎస్‌డీ(కోల్‌కంట్రోల్) సందీప్ ఎస్ పరాంజపే, సింగరేణి కొత్తగూడెం రీజియన్‌కు చెందిన ఓఎస్‌డీ (కోల్‌కంట్రోల్) సుబ్రహ్మణ్యం, శ్రీరాంపూర్‌జీఎం ఎం. శ్రీనివాస్ కలిసి గని పరిసరాల్లో చేపట్టిన పర్యావరణ చర్యలను తనిఖీ చేశారు. మొక్కలు, నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్షణ కంచెలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకుముందు జీఎం కార్యాలయంలో అన్ని వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్ర మంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఆర్‌కే-7 గ్రూప్ ఏజెంట్ రాజేందర్, కార్పొరేట్ అదనపు మేనేజర్(పర్యావరణం) తిరుపతి, అదనపు మేనేజర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) బాబ్జీ, డిప్యూటీ ఎస్ఎస్‌ఓ శేఖర్, ఆర్‌కే-7 మేనేజర్ తిరుపతి, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మీ, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి, పర్యావరణ అధికారి హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్త గనులతోనే సింగరేణికి మనుగడ

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తగనులతోనే సింగరేణికి మనుగడ సాధ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. ఎస్ఆర్‌పీ 3 గనిపై బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో మరో పదేళ్లలో సింగరేణి చేతిలో బొగ్గు గనులు ఉండవని పేర్కొన్నారు. వేలంలో పాల్గొని నూతన బ్లాకులను దక్కించుకోవడమే దీనికి మార్గమని చెప్పారు. గత ఐదేళ్లుగా స్ట్రక్చర్ సమావేశాలు లేకపోవడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, తాము యాజమాన్యంతో మాట్లాడి సమావేశాలు ఏర్పాటు చేయించామన్నారు. పలు డిమాండ్లను సీఎండీ దృష్టికి తీసుకుపోయామని తెలిపారు. ఆదాయం పన్ను మాఫీ, సొంతింటి పథకం అమలు మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ బాధితులు, డిస్మిసల్ కార్మికులకు ఉద్యోగం, 11 రకాల అలవెన్సులు ఇచ్చేందుకు యాజమాన్యాన్ని ఒప్పించామని తెలిపారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, అడ్డు శ్రీనివాస్, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి, నాయకులు దాడి రాజయ్య, తవటం మల్లేశ్, ఆడెపు సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు పద్ధతి ఎంపికను విరమించుకోవాలి

జైపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మెడికల్, సెక్యూరిటీ అధికారుల కాంట్రాక్టు పద్ధతి ఎంపికను విరమించుకోవాలని ఎస్టీపీపీ ఇన్‌చార్జీ ఈడీ శ్రీనివాసులుకు బుధవారం సీఎంవోఏఐ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఎం వోఏఐ అధికారులు అజ్మీర తుకారాం, అ ప్పారావు, శివ ప్రసాద్, శ్రీనాథ్, రమేష్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణతో ఉపాధికి మార్గం

శ్రీరాంపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వృత్తి శిక్షణతో ఉపాధికి మార్గం లభిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు ఉమారాణి అన్నారు. మూడు నెలల పాటు మహిళలకు నిర్వహించిన వృత్తి శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆమెతో పాటు డైరెక్టర్ సూర్యనారాయణ సతీమణి మాలతి హాజరయ్యారు. మహిళల అభివృద్ధికి సింగరేణి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ప్రకటనను ఉపసంహరించుకోవాలి

శ్రీరాంపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టుల కోసం యాజమాన్యం ఇచ్చిన ప్రకటనను ఉపసంహ రించుకోవాలని సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధికారులు సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు లేఖ రాశారు. ఈ మేరకు శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్‌కు బుధవా రం అందజేశారు. సంస్థ ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కున్నప్పుడు అధికారులు అండగా నిలిచారన్నారు. సంస్థలో మూడు దశాబ్దాలుగా పనిచేస్తూ ఎంతో అనుభవం ఉన్న వారిని కాదని, నూతన పద్ధతిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టుల కోసం ఉద్యోగ ప్రకటన ఇవ్వడం సమంజసం కాదన్నారు. అంకితభావంతో పనిచేసే అధికారులను ఇది నిరుత్సాహపరుస్తోందని, అభద్రతకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం బాధ్యులు కిరణ్‌కుమార్, మహేష్, భీమన్న, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దు

బెల్లంపల్లి/బెల్లంపల్లి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ శాంతిఖనిగని విస్తరణలో భాగంగా చేపడుతున్న లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వద్దని కోరుతూ బుధవారం నిజామాబాద్‌లోని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు రీజనల్ ఆఫీసర్ అధికారి లక్ష్మణ్ ప్రసాద్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టుఏర్పాటు అయితే పలు గ్రామాల్లో పర్యవరణ ఇబ్బందులతో పాటు వ్యవసాయ భూములకు సాగు చేసుకోవడం ఇబ్బంది అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, అశోక్‌గౌడ్, రవి, గొమాస వినోద్, సుమన్, రాజు పాల్గొన్నారు.



పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ రీజనల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

వరకట్నం వేధింపులు.. ఇద్దరిపై కేసు నమోదు

మంచిర్యాల క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపు కేసులో ముత్యాల రాంప్రసాద్(కాగజ్‌నగర్‌లో ఏఈ), ఆడపడుచు సరోజనలపై కేసు నమోదు చేసినట్టు మహిళాపోలీసు స్టేషన్ సీఐ నరేశ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2011లో మంచిర్యాల పట్టణం హమాలివాడకు చెందిన స్వాతితో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ముత్యాల రాంప్రసాద్‌తో వివాహం జరిగింది. ఆ సమయంలో పది తులాల బంగారు ఆభరణాలు, రెండు లక్షల విలువగల ఇంటి సామగ్రితోపాటు రూ.15లక్షలు కట్నంగా ఇచ్చారు. వారికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. కొంతకాలంగా ఆడపడుచు సరోజన, భర్త ముత్యాల రాంప్రసాద్ అదనపు కట్నం కోసం మానసికంగా శారీరకంగా వేధింపులకు గురిచేసే వారు. రాంప్రసాద్ ఇతర అమ్మాయిలతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని గతంలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా సంసారం సాఫీగా చేస్తానని రాసి ఇచ్చినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. అదనపు కట్నం కోసం భర్తతో పాటు ఆడపడుచులు తీవ్రంగా గాయపరిచి ఆసుపత్రిపాలు చేశారని స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

కౌటాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన ఉర్వత్ దౌలత్(26) తాగిన మైకంలో బావిలో పడి మృతి చెందినట్లు కౌటాల ఎస్సై మధు కర్ తెలిపారు. మృతుడు గత కొంత కాలంగా మద్యంకు బానిసై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడన్నారు. అప్పుడప్పుడు తాగి ఇంటికి రాకుండా ఉండేవాడన్నారు. మంగళ వారం నుంచి కనబడకుండా పోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా లిష్ణు ఇరిగేషన్‌కు సంబంధించిన బావిలో మృతదేహం లభించిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చడమే ధ్యేయం

ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్



ఆంధ్రజ్యోతి: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఏపీఎం: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలపై అవగాహనకల్పిస్తూ వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని మహిళ సంఘాలు ఉన్నాయి?

ఏపీఎం: 780 మహిళ స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 8,200 మంది సభ్యులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: సంఘాలకు స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారా?

ఏపీఎం: ఏటా స్త్రీనిధి రుణాలను సంఘం సభ్యులకు అందిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలను అందజేశాం.

ఆంధ్రజ్యోతి: బ్యాంకు లింకేజీ రుణాలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఏపీఎం: బ్యాంకు లింకేజీ రుణాలు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది రూ. 40 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం.

ఆంధ్రజ్యోతి: తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారా?

ఏపీఎం: తీసుకున్న రుణాలను సభ్యులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. 99 శాతం సంఘం సభ్యులు సకాలంలో రుణాలు చెల్లిస్తున్నారు.

- జైపూర్ (ఆంధ్రజ్యోతి)


నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనకబడిన తరగతుల అభ్యరులకు బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైద్రాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైద్రాబాద్ ద్వారా ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ప్రీ ట్రైనింగ్ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేటు బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. అర్హులైన వారు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8 వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీబీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఏప్రిల్ 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉంటుందన్నారు. వివరాల కోసం 08732-221280లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

గర్మిళ్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని వాసవీ వనితక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మంచిర్యాలలోని వైశ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలకు ఆటల పోటీలు, డాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళ నాయకురాళ్లు మాదంశెట్టి రమాదేవి, కొండ పద్మ, ప్రముఖ డాక్టర్ గోలి శృతి, నృత్య గురువు చిదా నందకుమారి, అటవీ అధికారి సాగరిక, మంచిర్యాల ఆర్ఐ స్వప్న, శిరీష, ఉపాధ్యాయురాలు శైలజ, సుష్మ, రమాదేవి, మాలతి, శ్రీదేవి, లావణ్య, జ్యోతి, భవానీ, సరిత, జ్యోతిలను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మల్యాల సంగీత, కార్యదర్శి కుకుడపు గాయత్రి, కోశాధికారి గుండ సునీత పాల్గొన్నారు.

జాగ్రత్తలే కిడ్నీలకు శ్రీరామ రక్ష



- జీవనశైలితోనే కిడ్నీల ఆరోగ్యం
- ప్రతీ పదిమందిలో ఒకరు వ్యాధిగ్రస్తులు
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

మంచిర్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో ప్రధానమైన అవయవం కిడ్నీ. రక్తాన్ని వడబోసి అందులోని మలినాలను శుభ్రం చేసి మంచి రక్తాన్ని గుండెకు చేరవేయడంతో పాటు చెడు రక్తాన్ని మలినాల రూపంలో మూత్రం ద్వారా బయటకి పంపించడంలో కిడ్నీ ప్రధాన పాత్ర పోషిస్తుంది. మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలి, క్రమబద్ధమైన వ్యాయామం ద్వారా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. నేడు ప్రపంచ కిడ్నీ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'ప్రత్యేక కథనం..

కిడ్నీ వ్యాధుల రకాలు...

సీకేడీ (క్రానిక్‌కిడ్నీ డిసీస్), ఏకేఐ (అక్యూట్ కిడ్నీ ఇంజ్యూర్), గ్లోమెరూలర్ డిసార్డర్, యుటీఐ (యూరినరి ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్), కిడ్నీలో రాళ్ల, కిడ్నీ కాన్సర్ ప్రధానమైనవి. వీటిలో సీకేడీ అత్యంత ప్రమాదకరమైనది. సీకేడీ ఐదు దశల్లో విస్తరిస్తుంది. ఐదో దశకు చేరిన తరువాత రోగి పరిస్థితులను బట్టి డయాలసిస్ ప్రారంభించాల్సి ఉంటుంది. ఆలోపు దశలు ఉన్న వారికి వైద్యులు మందులతో నయం చేసే ప్రయత్నం చేస్తారు. సీకేడీ దీర్ఘకాలిక వ్యాధి. ప్రపంచంలో కిడ్నీ వ్యాధి 7వ స్థానంలో ఉండి అత్యధిక మరణాలకు కారణమవుతుంది.

నివారణ చర్యలు...

ఎక్కువగా నీరు తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తక్కువ ప్రోటీన్లు ఉన్న ఆహారం తీసుకోవడం, అధిక ప్రోటీన్లు ఉన్న మాంసం, చికెన్ వినియోగం తగ్గించడం ద్వారా కిడ్నీ సమస్యలను కొంత వరకు నివారించవచ్చు. ఆకు కూరలు, కూరగాయలు, గుడ్లు, చేపలు, చిలగడ దుంపలు, కాలిఫ్లవర్, పండ్లు (యాపిల్స్, పైనాపిల్స్, జామ, బొప్పాయి) తీసుకోవడం. పొగ త్రాగడం, మద్యం సేవించడం మానివేయడం, గుట్కా, కర్ర, బీడీ, చుట్టా సేవించడం మానివేయడం ద్వారా కూడ కిడ్నీలను సంరక్షించుకోవచ్చు.

మహిళల్లో అధిక సమస్యలు...

కిడ్నీలో ఉన్న నెఫ్రాన్‌ల సంఖ్య మగవారికన్నా మహిళల్లో తక్కువగా ఉండడం వల్ల స్వల్ప కారణాలకు కిడ్నీలు త్వరగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. గర్భధారణ సమయంలో రక్తపోటు, కృత్రిమ గర్భధారణ కోసం వాడే మాత్రల ప్రభావం కిడ్నీలపై పడుతుంది. గర్భధారణ సమయంలో కలిగే రక్తపోటు వల్ల పదిశాతం మహిళలు కిడ్నీ వ్యాధిని ఎదుర్కొంటున్నారు. అలాగే చట్టవిరుద్ధమైన గర్భస్రావాలు కూడా కిడ్నీ వైఫల్యాలకు కూడ కారణాలుగా నిలుస్తున్నాయి.

యుక్త వయస్సులో ఉన్న స్త్రీలలో అధికంగా కనిపించే వ్యాధి లుపస్ నెఫ్రైట్స్, ఇది శరీరంలో వ్యాధి నిరోధక శక్తి విఫలమైనప్పుడు సంభవిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా 50 లక్షల మంది కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది తెలంగాణలో రెండువేల మంది కిడ్నీ వ్యాధికి గురై మరణించినట్లు సమాచారం.

డయాలసిస్ చికిత్స...

మూత్ర పిండాలు విఫలమైనవారికి శరీరం నుంచి వ్యర్థ పదార్థాలు, అదనపు నీటిని తొలగించడం కోసం వైద్యులు డయాలసిస్ చికిత్స అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో డయాలసిస్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ అందుబాటులో ఉంది. ఇందులో నిత్యం పది మందికి చికిత్స అందుతుండగా 30 బెడ్లకు పెంచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ చికిత్స పూర్తిగా ఉచితంగా అందుతుండగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒక సెషన్‌కు రూ.2500 వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. రోగి ఆరోగ్య పరిస్థితులను బట్టి వారానికి ఒకటి నుంచి మూడు సెషన్‌లు డయాలసిస్ చికిత్స చేయాల్సి ఉంటుంది.

సకాలంలో వ్యాధిని గుర్తించడం ముఖ్యం...

డాక్టర్ రాకేశ్ చెన్న, నెఫ్రాలజిస్టు, ఆద్య కిడ్నీ డయాలసిస్ సెంటర్, మంచిర్యాల

WORLD KIDNEY DAY



కిడ్నీ వ్యాధిని సకాలంలో గుర్తించడం ద్వారా నయం చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. కిడ్నీ పని తీరును ఎప్పటికప్పుడు వైద్యులతో పరీక్షించుకోవడం తప్పనిసరి. కిడ్నీ వ్యాధులను మందులతోనే నయం చేసే అవకాశం అధికంగా ఉంటుంది. డయాలసిస్ స్థాయికి వచ్చినంత మాత్రాన జీవితం ముగిసి పోతుందనే భావన సరైంది కాదు. డయాలసిస్ స్టేజీలో 20 సంవత్సరాల పాటు బ్రతి కిన వారు ఉన్నారు. సాధారణంగా వ్యక్తి ఆరోగ్య స్థితిగతులను బట్టి డయాలసిస్ స్టేజికి చేరిన వ్యాధిగ్రస్థుడు ఐదు నుంచి పదేళ్లపాటు జీవించగలుగుతారు. క్రమం తప్పని వ్యాయామం, మంచి ఆహారం, జీవనశైలి, డయాలసిస్ రోగి జీవితకాలాన్ని మరింతగా పెంచుతాయి.

కిడ్నీ ఆరోగ్యానికి ఎనిమిది సూత్రాలు...



1) ఆరోగ్యం 2) ఆరోగ్యకరమైన ఆహారం
3) షుగర్ కంట్రోల్‌లో పెట్టడం
4) ఎప్పటికప్పుడు బీపీ చెక్ చేసుకోవడం
5) పొగత్రాగడం మానుకోవడం
6) నొప్పి నివారణ మాత్రల వాడకం తగ్గించడం
7) కిడ్నీల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం
8). మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం వల్ల కిడ్నీని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది.

మూత్రపిండాల వైఫల్యం లక్షణాలు...

1. అలసట, బలహీనత,
2 వికారం, వాంతులు, ఆకలి లేకపోవడం
3 శ్వాస ఆడకపోవడం,
4. మూత్ర విసర్జనలో మార్పులు
5. శరీరంలో వాపులు
6. అధిక రక్తపోటు, మానసిక ఆందోళన
7. దురద, మూత్రంలో నురుగు
8. చలిని తట్టుకోలేకపోవడం ఈ లక్షణాలు కిడ్నీ వ్యాధికి సంబంధించినవి. ఇవి కనిపించగానే వైద్యున్ని సంప్రదించడం తప్పనిసరి.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి



విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రజా సేవా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యారులు ఏకా గ్రతతో పరీక్షలకు సిద్ధం కావాలని, పరీక్షలంటే భయపడవద్దని తెలిపారు. ముందుగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలని తెలిపారు. పదో తరగతి పరీక్షలు జీవితానికి తొలి మెట్టు అని, ఒక్క మెట్టు ఎక్కితే ప్రపం చాన్నే జయించవచ్చని తెలిపారు. సమాజం గర్వించదగ్గ స్థాయికి ప్రతీవిద్యార్థి ఎదగాలన్నారు.కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అజిమోద్దీన్, ప్రభుదేవ, మండల అధ్యక్షులు సకినాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని సిర్సా, అన్నారం గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు బుధవారం మంచిర్యాలకు చెందిన మాధవ సేవా సమితి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రి అందించారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి మిట్టపల్లి రవీందర్‌రెడ్డి, బెండ శ్రీనివాస్, రాగుల సుధాకర్, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ కృష్ణ భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, జావీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కల బారి నుంచి రక్షించాలి

మందమర్రి టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆయా కాలనీల్లో వింత వ్యాధుల బారిన పడిన శునకాల సంచారం పెరిగిందని వాటి నుంచి ప్రజలను రక్షించాలని కోరుతూ బుధవారం సదాసేవా సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రాజలింగుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు సంగి సంతోష్ మాట్లాడుతూ కుక్కలకు శరీరంపై ఉన్న వెంట్రుకలు పూర్తిగా ఊడిపోయి గాయాలతో తిరుగుతున్నాయని తెలిపారు. చిన్న పిల్లలు బయటకు వస్తే దాడులు చేస్తున్నాయని, వాటిని ఊరికి దూరంగా తరలించాలని తెలిపారు. ప్రజలు కూడా వ్యాధుల భారీన పడుతున్నారని, వాటి నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

'చలో ఢిల్లీ' కరపత్రాల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 11న నిర్వహించే చలో ఢిల్లీ కరపత్రాలను బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యాసంస్థల్లో మతోన్మాదాన్ని చొప్పించే విధంగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా తీసుకువచ్చిన ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ కార్యక్ర మంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సన్నిగౌడ్, నాయకులు సుమంత్, మహేష్, జతిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌కే-6 గని లక్ష్యాన్ని చేరుకునేందుకు సహకరించిన ఉద్యోగులు అభినందనీయులని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. గని ఉత్పత్తి లక్ష్యం లక్ష 80 వేల టన్నులు కాగా, 20 రోజులు ముందుగానే ఉత్పత్తి సాధించిన సందర్భంగా బుధవారం గనిపై ఉద్యోగులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్‌కే 5, 6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస్ భట్టాచార్య, గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ముస్కె సమ్మయ్య, పాల్గొన్నారు.

తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలి

శ్రీరాంపూర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి విశ్రాంత కార్మికులకు తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి ప్రాంతంలో నివసిస్తున్న రిటైర్డ్ కార్మికులకు ఖాళీ క్వార్టర్లు కేటాయించాలని కోరారు.

నక్కలపల్లికి బస్సు నడిపించాలి

కోటపల్లి/మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లికి ఆర్టీసీ బస్సును నడపాలని కోరుతూ బుధవారం బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ దుర్గం అశోక్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. నక్కలపల్లికి మూడు పూటలా బస్సు నడపాలని కోరారు. మేనేజర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్సు నడిపిస్తామని హామీ ఇచ్చినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య పేర్కొన్నారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు పెద్దపల్లి పురుషోత్తం, పార్టీ మండల ఇన్‌చార్జి కాశెట్టి నాగేశ్వర్ రావు, మండల అధ్యక్షుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు బోనస్ ఎప్పుడు?

(5వపేజీ తరువాయి)

సన్నరకం ధాన్యం 44,344 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా 7,517 మంది రైతులకు మొత్తం రూ.22.17 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ నెల 4వ తేది వరకు సన్నరకం ధాన్యానికి సంబంధించిన బోనస్ కేవలం రూ.4.46 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేయగా ఇంకా 6,242 మంది రైతులకు రూ.17.71 కోట్ల చెల్లింపులు జరగాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం చెల్లించింది. 20శాతం బోనస్ మాత్రమే కావడం గమనార్హం. ఇంకా 80శాతం చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితులు ఉన్నాయి.

● అకౌంట్లు సరిగ్గా లేవనే నెపంతో...

చెల్లింపుల విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా బ్యాంక్ అకౌంట్లు సరిగ్గా ఉన్న రైతులకు చెల్లింపులు జరిగాయని, అకౌంట్‌లో తప్పుల కారణంగా కొంత మొత్తం పెండింగ్‌లో ఉందని సమాధానం ఇస్తున్నారు. అయితే పంట విక్రయించిన తరువాత 15రోజుల్లోగా రైతుల అకౌంట్లలో నగదు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు నెలలు గడిచినా చెల్లింపులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు యాసంగి సీజన్ కూడ ప్రారంభమైనా బోనస్ చెల్లింపులు జమ చేయకపోవడంతో సాగు పెట్టుబడులకు ఇబ్బంది పడాల్సి వచ్చిందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటించిన విధంగా వెంటనే బోనస్ డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

పట్టుదలతో చదివి.. మూడు ఉద్యోగాలు సాధించిన యువకుడు



బొడ్డు తిరుపతి

మందమర్రి టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన బొడ్డు తిరుపతి మంగళవారం ప్రక టించిన గ్రూపు- 2 ఫలితాల్లో 77వ ర్యాంకు సాధించాడు. 2019లో సింగరేణి సంస్థ నిర్వహించిన జేఎంటీ పరీక్షల్లో సింగరేణి వ్యాప్తంగా 2వ ర్యాంకు సాధించి సింగరేణిలో ఉద్యోగంలో చేరారు. 2022లో లాంగ్ లీవ్ తీసుకొని గ్రూపు-4 పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. ఆ ఉద్యోగాన్ని కూడా సాధిం చడంతో సింగరేణికి రాజీనామా చేసి ప్రస్తుతం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రూపు-2లో 77వ ర్యాంకు రావడంతో ప్రాణహిత కాలనీలో బుధవారం కాలనీ వాసులు తిరుపతిని అభినందించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఇష్టపడి చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమైతే ప్రతీ ఒక్కరు ఉద్యోగం సాధిస్తారని చెప్పారు.

చెక్ డ్యామ్‌ను మరో చోట నిర్మించాలి

జైపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి చెరువుకు సమీపంలో ఉన్న స్థలంలో చెక్ డ్యామ్ నిర్మించడం చెరువుకు ప్రమాదకరమని మరో చోటకు మార్చాలని గంగిపల్లికి చెందిన రైతులు ఎంపీడీవో సత్యనారాయణకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు రిక్కుల లక్ష్మీనారాయణ, శీలం వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

బీజేపి నాయకుల ముందస్తు అరెస్టు



లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో బీజేపీ నాయకులు

లక్షెట్టిపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బారతీయ జనతాపార్టీ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేసారు. దండేపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రైతులకు ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేసేందుకు పిలుపునిచ్చారు. దీంతో బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్, మండల అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి, నాయకులు వేముల రాజగురువయ్య, వెంకటరమణ, గంగన్న ఉన్నారు.

హాజీపూర్(లక్షెట్టిపేట): దండేపల్లికి బీజేపీ నాయకులు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన నాయకుల్లో గడ్డం స్వామిరెడ్డి, అశ్విన్‌రెడ్డి, రాజనర్సు, ధర్మయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి బుధవారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం దండేపల్లి మండల బీజేపీ నాయకులను, రైతులు నిరసన కార్యక్రమం తలపెడితే వారిని అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీపనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమారస్వామి

వేమనపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుమారస్వామి సూచించారు. బుధవారం నీల్వాయి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గరిష్ఠ వేతనం రూ. 300 పొందేలా పనులను చేయాలని, వంద రోజుల్లో పనులను పూర్తిచేసుకోవాలన్నారు. అనంతరం క్యాతనపల్లి, గొర్లపల్లి, వేమనపల్లి, రాజారాం గ్రామాల్లో జరుగుతున్న స్కూల్ ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. నర్సరీలను, పశువుల పాకల పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, సాయి, జాఫర్, పోశం ఉన్నారు.

సహజ రంగుల తయారీ

దండేపల్లి, మార్చి12 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా మండలంలోని గుడిరేవు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గోగుపూలతో పర్యావరణహితమైన రంగులను బుధవారం తయారు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి బుచ్చన్న మాట్లాడుతూ సహజరంగులు చర్మానికి, కంటికి ఎలాంటి హాని కలిగించవన్నారు. కార్య క్రమంలో ఉపా ధ్యాయురాలు శ్యామల, అంగన్ వా డీ టీచర్ లక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలను పెంచాలి



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను పెంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం వంద పడకల ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ల్యాబ్, ఫార్మసీలో ప రిశీలించి రోగులతో వైద్యం అందుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు పౌష్టికాహారం సకాలంలో అందించాలని సూచించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. డివిజన్ స్థాయిలో వచ్చే సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు కోసం స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరిక్రిష్ణ, తహసీల్దార్ జ్యోష్న, పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

బెల్లంపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతామని డీసీపీ భాస్కర్ అన్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న దృష్ట్యా పరిశీలించి ట్రాఫిక్ సమస్య కోసం ప్రత్యేక చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

రజకుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రజకుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రజకుల కోసం హైటెక్నాలజీ దోబీఘాట్‌ను నిర్మించాలన్నారు. రజకుల ఇబ్బందులను తీర్చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రజకుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ గౌరవాధ్యక్షుడు సంగెపు ఎల్లన్న, రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి తిరుపతి, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక రమేష్, సభ్యులు రాజయ్య, రాయ మల్లు, ఎల్లయ్య, వెంకటేష్, చంద్రయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

చింతలమానేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో జయరాజు అన్నారు. బుధవారం మండలంలోని దిందా, చిత్తమా, కోయపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేరుగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.

రుణాలు వంద శాతం రికవరీ చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభివృద్ధిలో భాగంగా అందించే స్త్రీ నిధి రుణాలను వంద శాతం రికవరీ చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి బుధవారం ఏపీఎం, సీసీలు, మెప్మా సిబ్బందితో స్త్రీ నిధి రుణాల రికవరీ, నూతన రుణాల జారీ ప్రమాదబీమా, బ్యాంకు లింకేజీ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లా డుతూ మార్చి నెలాఖరుకల్లా స్త్రీ నిధి రుణాల రికవరీ, ఓవర్ డ్యూస్ రికవరీ వంద శాతం పూర్తి చేసే విధంగా అధికారులు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ స్త్రీ నిధి రుణాలు బకాయి కలిగిన సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి సంఘాల మనుగడపై వివరించాలని సూచించారు. వంద శాతం రుణాలను తిరిగి చెల్లించిన సంఘాలకు నూతన రుణాలు అందించాలని తెలిపారు. తనంతరం మండలాల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సు కోసం ప్రయాణికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ వెళ్లే రూట్‌లో రాత్రి ఏడు గంటలకు నడిపే ఎక్స్‌ప్రెస్ బస్సుతో పాటు అదనపు బస్సు వేయాలంటూ ప్రయాణికులు బస్టాండులో ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టడంతో బస్టాండులో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కెరమెరి, ఝరి, ధనోర, కొరారి, వాడిగూడ నుంచి ప్రతీ రోజు కూలీ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వస్తున్నామని చెప్పారు. రాత్రి వేళ ఇంటికి వెళ్లే క్రమంలో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించు కోకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. కెరమెరి వరకు రాత్రి ప్రత్యేక బస్సు నడపాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనతో బస్టాండు లోనికి వచ్చే బస్సులు నిలిచి పోయాయి. ఆర్టీసీ అధికారులు కెరమెరి వరకు ప్రత్యేక బస్సుతో పాటు ఆదిలాబాద్ ఎక్స్‌ప్రెస్ సర్వీసును ఒకే సారి పంపడంతో ప్రయాణికులు ఆందోళన విరమించారు.

దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు



దివ్యాంగుల వైకల్యం శాతం ధ్రువీకరిస్తూ జారీ చేస్తున్న సదరం ధ్రువపత్రాల స్థానంలో కొత్తగా యూడీఐడీ(యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ) కార్డులు జారీ కానున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ఈ విధానం ఇప్పటికే అమలులో ఉండగా తెలంగాణలో మార్చి నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు.

- ఇక నుంచి యూడీఐడీ జారీకి ఏర్పాట్లు
- ఐడీ ఆధారంగానే పింఛన్లు, సంక్షేమ పథకాల వర్తింపు
- పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన

ఆసిఫాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు ఒకే విధమైన ప్రత్యేక గుర్తింపు కార్డులను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చింది. ఇక నుంచి దేశంలోని దివ్యాంగులందరికీ యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ(యూడీఐడీ) కార్డులను జారీ చేయనున్నారు. ప్రస్తుతం వైకల్యం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సదరం సర్టిఫికెట్లు జారీ చేసోంది. ఈసారి వీటినే యూడీఐడీ కార్డుగా మార్చి ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే పలు రాష్ట్రల్లో యూడీఐడీ కార్డులు జారీ చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలోనూ మార్చి నెల నుంచి అమలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా చెల్లుబాటయ్యే ఈ కార్డు ద్వారా దివ్యాంగులకు మేలు జరుగనుంది.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో మొత్తం దివ్యాంగులు 5834 మంది ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో ఉన్న దివ్యాంగులు నెల నెలా పింఛన్ పొందుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలో 575 మంది దివ్యాంగులు ఉన్నారు. బెజ్జూర్‌లో 240, చింతలమానేపల్లిలో 347, దహెగాంలో 399, జైనూరులో 301, కాగజ్‌నగర్‌లో 1629, కెరమెరిలో 241, కౌటాలలో 408, లింగాపూర్‌లో 120, పెంచికల్‌పేటలో 210, రెబ్బెనలో 454, సిర్పూర్(యూ)లో 97, సిర్పూర్(టి)లో 350, తిర్యాణిలో 184, వాంకిడిలో 281 మంది ఉన్నారు.

● 21 రకాల వైకల్యాలకు..

సదరం ధ్రువపత్రాల్లో ఇప్పటి వరకు ఏడు రకాల వైకల్యాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇక నుంచి 21 రకాల వైకల్యాల వారికి యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డులు ఇవ్వనున్నారు. ఈ యూడీఐడీ కార్డుల కోసం ఎప్పటి మాదిరిగానే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు హాజరవ్వాల్సి ఉంటుంది. ముందుగా మీసేవా కేంద్రంలో స్లాట్ బుకింగ్ చేసు కోవాలి. సమగ్ర వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సంతకం, ఆధార్‌కార్డు వివరాలతో పాటు సదరం శిబిరం నిర్వహించే కేంద్రాన్ని ఎంచుకోవాలి. ఏ రోజు సదరం శిబిరం నిర్వహిస్తారో వివరాలు తెలియజేస్తూ దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్‌కు సందేశం వస్తుంది. అక్కడికి వెళ్తే వైద్యులు వైకల్యాన్ని నిర్ధారించి శాతాన్ని పోర్టల్‌లో నమోదు చేస్తారు. కొత్త వారితో పాటు ఇప్పటికే సదరం ధ్రువపత్రం ఉన్న వారికి కూడా ఈ స్మార్ట్ కార్డులు జారీ చేయనున్నారు. ఈ కార్డులు డిజిటల్ సంతకంతో తపాలా ద్వారా దివ్యాంగుడి ఇంటి చిరునామాకు వస్తుంది. దీనిలో ఐడీ నంబరు, పేరు, వైకల్య రకం, శాతం తదితర వివరాలు ఉంటాయి. ఈ కార్డును దేశంలో ఎక్కడైనా వినియోగించవచ్చు. జిల్లాలో యూడీ ఐడీ కార్డుల జారీకి దివ్యాంగులకు అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

● వైకల్య శాతం ఆధారంగా..

దివ్యాంగులకు వైకల్య శాతాన్ని పరిశీలించి ఇప్పటి వరకు సదరం ధువపత్రాలను జారీ చేస్తున్నారు. ఈ విధానానికి ప్రసుత్తం ప్రభుత్వం స్వస్తి పలికింది. మార్చి 1 నుంచి రాష్ట్రంలో కూడా యూడీఐడీ కార్డుల విదానం అమలులోకి తీసుకు వచ్చింది. రానున్న రోజుల్లో యూడీఐడీ కార్డు ఉంటేనే దివ్యాంగులకు పింఛన్లు, సంక్షేమ పథకాలు వర్తింపచేస్తారని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 5,834 మంది దివ్యాంగులు ప్రభుత్వం నుంచి పెన్షన్ పొందుతున్నారు. ప్రభుత్వ సర్వీసులో ఉన్నవారు కూడా యూడీఐడీ కార్డు వివరాలను తమ సర్వీసు రికార్డులో నమోదు చేసుకోవల్సి ఉంటుంది. వైకల్య శాతం అదారంగా నిర్ధారిత రంగుల్లో యూడీఐడీ కార్డులు జారీ చేయనున్నారు. కార్డు ఒక్కసారి ఇస్తే తిరిగి పునఃరుద్ధరించు కోవాల్సిన అవసరం ఉండదు. బస్సుల్లో, రైళ్లలో రాయితీతో పాటు దివ్యాంగులకు వర్తించే అన్ని సౌకర్యాలు పొందవచ్చు.

యూడీఐడీతో ప్రయోజనం..



– ఇస్లాంబీన్ హసన్, దివ్యాంగుల సంఘం నాయకుడు

యూడీఐడీ కార్డుతో దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుతం 21 వైకల్యాల వారికి కార్డులను జారీ చేస్తున్నారు. దీన్ని 2016లోనే అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వం కాలయాపన చేసింది. గతంలో వైకల్యం లేదని తిరిస్కరించిన వారికి సైతం మరోసారి పరీక్షలు నిర్వహించాలి. అర్హులైన దివ్యాంగులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలి.

పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి..



– యశోద, డీపీఎం

యూడీఐడీ పోర్టర్‌లో దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి. మార్చి 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఇది వరకే సదరం సర్టిఫికెట్ పొంది ఉన్న దివ్యాంగులు దరఖాస్తు చేసుకో వల్సిన అవసరంలేదు. వారి సదరం సర్టిఫికెట్ ఆధారంగా యూడీ ఐడీ కార్డు జారీ చేస్తారు.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్

కెరమెరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని కెరమెరి మండలం ధనోర వద్ద గల డబ్ల్యూటీపీని సందర్శించి మిషన్ భగీరథ ఈఈ రాకేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామానికి భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు.. గిరిజన ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించడంతో పాటు వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రానున్న వేసవిలో అనుసరించాల్సిన విధానానికి సంబంధించి కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత భగీరథ అధికారులపై ఉందన్నారు. వేసవి దృష్ట్యా తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను మిషన్ భగీరథ ఈఈ రాకేష్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ఆయన గోయగాం జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు అంటే భయంగా కాకుండా ఇష్టంగా రాయాలని, ప్రీఫైనల్ పరీక్షల లో సబ్జెక్టుల వారిగా వచ్చిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మ్యాథ్స్ సబ్జెక్టులో వెనకబడి ఉన్నారని సంబంధిత ఉపాధ్యాయుడిని పిలిచి విద్యార్థులు పురోగతి వచ్చేలా చూడాలన్నారు. మరో వారం రోజుల సమయం ఉన్నందున వారందరిని పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనంను పరిశీలించి మెనూ పాటించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో ఆడె ప్రకాష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

భూ సమస్యలపై దృష్టి పెట్టాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): వివిధ భూ సమస్యలపై దరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులలో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరే భవన సముదాయంలో బుదవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అన్ని మండలాల తహసీల్దార్‌లతో ధరణి(భూభారతి)లో వచ్చిన సమస్య లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. రికార్డులను సరి చూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ దరఖాస్తు వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు లాగిన్‌లో ఉన్న ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజా వాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రతీ రోజు సమీక్షించాలని సూచించారు.

● సంక్షిప్తం..

● బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న ఎల్లారం పోచమ్మ ఆలయంలో మండల పూజ చేశారు.
- మండలంలోని సోమిని ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థులకు ఎస్సై ప్రవీణ్ కుమార్ వాలీబాల్ కిట్‌ను అందజేశారు.

● పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): లోడ్‌పల్లి, కొండపల్లి గ్రామాల్లో బుధవారం ఉపాధిహామీ పని ప్రదేశంలో వసతులపై ఎంపీడీవో అల్బర్ట్ ఆరా తీశారు.

● సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట, అచ్చెల్లి గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో సత్యనారాయణ బుధవారం పరిశీలించి సూచనలు చేశారు.

● ఆసిఫాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): దృష్టిలోపం ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం జిల్లా వైద్యాధికారి తుకారాం కంటి అద్దాలను పంపిణీ చేశారు.

● వాంకిడి, (ఆంధ్రజ్యోతి): రింగరేట్‌లో సమస్యలు పరిష్కరించాలని టీప జీఎస్, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు కోరారు.

ఆర్టీసీ డిపో మేనేజరు బదిలీ

ఆసిఫాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజరు విశ్వనాథ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వనాథ్ స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న కేవీ రాజశేఖర్‌ను పదోన్నతిపై ఆసిఫాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తొలి ప్రయత్నంలోనే లెక్చరర్ కొలువు

● ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం



నియామకపత్రం అందుకుంటున్న ప్రవళిక

కాగజ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ముత్యంవార్ ప్రవళిక తొలి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్ సాధించారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కరీంనగర్ జిల్లా మానకొండురులో పోస్టింగ్ ఉత్తర్వులను తీసుకున్నారు.

యువత పట్టుదలతో ముందుకు సాగాలి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జీవితంలో పైకి ఎదగాలంటే యువత పట్టుదల సంకల్పంతో ముందుకు సాగాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. పట్టణంలోని ఆదివాసీ భవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన క్రీడాకారుల సన్మాన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ స్పోర్ట్స్ ఆఫీసర్ మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు తదితరులు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత



అధికారులు పట్టుకున్న దేశీదారు

ఆసిఫాబాద్‌రూరల్/వాంకిడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం గోయగాం వద్ద బుధవారం 1010 దేశీదారు బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ అదేశాల మేరకు బుధవారం గోయంగాం వద్ద మహరాష్ట్రలోని చంద్రపూర్ నుంచి సిరొంచకు వెళుతున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సును తనిఖీ చేశామని చెప్పారు. తనిఖీల్లో దేశీదారు 1010 బాటిళ్లు, రాయల్‌స్టాగ్ 11 బాటిళ్లు, ఒక ఐబీ, ఒక ఆఫీసర్ చాయిస్ బాటిళ్లను లభించాయని అన్నారు. ఈ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ. 58వేలు ఉంటుందన్నారు. సీఐ మాట్లాడుతూ హోలీ పండుగను పురష్కరించుకొని దేశీదారు అక్రమ రవాణా సాగుతు న్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. దేశీదారు పట్టుకున్న సీఐ, సిబ్బందిని డీపీఈవో అభినందించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు ధన్‌రాజ్, రజిత, మమత పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ఆసిఫాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేస్తున్న దినసరి, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు కనీసం వేతనం రూ. 26వేలు చెల్లించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 64 అమలును వెంటనే నిలిపి వేసి పాత పద్ధతిలోనే జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో 212ను సవరించి 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉన్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, శ్యాంరావు, సీతారాం, సదాశివ్, రమేష్, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఏకైక బాలికల క్రీడా పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి క్రీడా పరీక్ష పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ అమ్మాయిలు విద్యాతో పాటు క్రీడా రంగంలో రాణించాలని, ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఆసిఫాబాద్ క్రీడా పాఠశాల మొదటి స్థానంలో ఉందన్నారు. మున్ముందు క్రీడా పాఠశాల నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు తయారవుతారని తెలిపారు. అలాగే మంచిర్యాలలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో తిర్యాణి గిరిజన ఆశ్రమ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ మిస్టర్ ఆదిలాబాద్ టైటిల్‌ను సొంతం చేసుకోవడంతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, ఏటీడీవో చిరంజీవి, ప్రధానోపాధ్యాయుడు జంగు, మంచిర్యాల క్రీడాధికారి జీవరత్నం, పేట కార్యదర్శి కృష్ణమూర్తి, వ్యాయమ ఉపాధ్యాయుడు మధుసూదన్, శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, జిల్లాలోని పీఈటీలు, పీడీలు షేకు, లక్ష్మణ్, వెంకటేష్, రాజేంద్రప్రసాద్, సుందర్‌సింగ్, అరవింద్, సంగీత, గంగభవాని, రాజ్‌కుమార్, సంగీత, హీరాబాయి, సుజాత, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.